



జి.పద్మావతి

# కనువిప్పు

వచ్చే వైశాఖమాసంలో పరీక్షలున్నాయెూ ఏవోగాని, అదే పనిగా సాధన చేసేస్తోంది కోకిల, చెట్టుకొమ్మల మీద. మావి చిగుళ్ళన్నా తిన్నదో లేదో పాపం!

చెట్లకింద ఆటలాడ్తున్న ఆకతాయి పిల్లలు దాన్నింకా ఎంకరేజ్ చేసి రెచ్చగొడ్తున్నారు కూడా పాడేస్తున్నారు. ఎక్కడుందా అని వెతుకుతున్నారు కోకిల గానాన్ని వింటూ. ఆడుకునే పిల్లల్ని, ఒక పక్కన మిగిలిన పరీక్షల కోసం చదువుకునే పిల్లల్ని గమనిస్తూ ఆఫీసువర్కు చేసుకుంటోంది సరోజ. సాయంత్రం పేరెంట్స్ రాగానే ఎగురుకుంటూ, స్వేచ్ఛగా ఎగిరే పక్షుల్లాగా, పంజరంలోంచి బయటపడ్డట్టూ, ఆనందంగా వెళ్ళే పిల్లల్ని చూడ్డం సరోజకెంతో ఇష్టం. వర్క్ త్వరగా ఫినిష్ చేసేసుకునయినా కారిడార్‌లోకొచ్చి చూస్తూంటుంది.

ఆరోజు ఆఖరుపరీక్ష అవటంతో హాస్టల్‌లో పిల్లల్ని పేరెంట్స్‌కి ఫోన్ చేసి రప్పించి అప్పగించే బాధ్యత ఆమెకే అప్పజెప్పారు ప్రిన్సిపాల్. అందుకే కిటికీలోంచి బయటికి చూస్తూ పనిచేసుకుంటుంది. కొంతమంది మరునాడు వస్తాం అన్నవాళ్ళ లిస్ట్ రాసుకుంటుంది.

"మిస్ మే ఐ కమిన్!" ముద్దుగా వినపడేసరికి గుమ్మంలోకి చూసింది. సెకండ్‌క్లాస్ చదువుతున్న హారిక నుంచుంది.

"అరే!..హారికా...రామ్మా, లోపలికి రా...! ఏంటిలా వచ్చావు అమ్మ రేపు వచ్చి నిన్ను తీసుకెళతానంది. ఇప్పుడే ఫోన్ చేసాను" అంటూ దగ్గరకు లాక్కుని బుగ్గ మీద ముద్దుపెట్టుకుని చిన్నకుర్చీలో కూర్చోబెట్టింది. బ్యాగ్‌లోంచి చాక్లెట్ తీసిచ్చింది.

దానివంకే చూస్తూకూర్చుంది హారిక. కాస్త డల్‌గా ఉంది.

"ఏమ్మా! వంట్లో బాగా లేదా..అమ్మ గుర్తు వస్తుందా..రేపు పంపిస్తాను సరేనా!" అనునయించబోయింది సరోజ.

"సెలవుల్లో హాస్టల్‌లో ఉండకూడదా మిస్..నేను ఇంటికి వెళ్ళను. ఇక్కడే ఉంటాను" చాక్లెట్ రెండు చేతుల్తో నలుపుతూ భయం భయంగా చూస్తూ ఆగి ఆగి చెప్పింది హారిక.

ఉలిక్కిపడింది సరోజ. తను తప్పుగావిన్నదో, లేక దానికి చెప్పడం రావట్లేదో అనుకుంది.

"అమ్మ ఊళ్ళోలేరంట. నాన్నా, ఏదో క్యాంప్‌కెళ్ళారంట..రేపు వస్తారు" అంది దగ్గరగా తీసుకుని.

"వద్దు! నేను అమ్మతో వెళ్ళను. ఇక్కడే ఉంటాను" నిశ్చయంగా అంది ఆ ఏడేళ్ళ చిన్నారి.

"సెలవుల్లో స్కూలు, హాస్టల్ అన్నీ మూసేస్తారు కదా..ఇక్కడ ఉండడానికి ఉండదు. అయినా చిన్నపిల్లలు ఎప్పుడు ఇంటికెళ్దామా అని ఉంటారు నువ్వేంటిలా?" అనడిగింది సరోజ.

తలవంచుకుని చాక్లెట్ రేపర్ తిప్పుతూంది హారిక.."ఇక్కడ ఎవ్వరూ ఉండరమ్మ!" అంది మళ్ళీ సరోజ.

"ఇంటికెళితే తోచదు. ఆడుకోడానికి ఎవరూ ఉండరు. ఇక్కడ మీరుంటారు కదా అమ్మకంటా ముద్దుగా చూస్తారు. నా ఫ్రెండ్స్ ఉంటారు. నేనింటికి వెళ్ళను!" అంటూ గట్టిగా వెక్కివెక్కి ఏడ్చేసింది హారిక.

టేబిల్ మీద రాసే కాగితాలన్నీ ఒక పక్కకి సర్ది పేపర్‌వెయిట్ పెట్టి లేచి హారికను దగ్గరగా తీసుకుని ఊరడించి ప్రక్కనున్న బెంచిమీద కూర్చుంది సరోజ.

తోచకపోవడం ప్రధాన కారణంగా ఆమెకు అనిపించలేదు. ఏదో ఉంది, హారిక ఎప్పుడు సెలవులు వచ్చినా ఇంటికి వెళ్ళడానికి మారాం చేస్తుంది. ఇంత చిన్న వయసులో అంత నిర్వేదం ఏంటో! "పోనీ అమ్మమ్మగారింటికో, నాన్నమ్మదగ్గరికో వెళ్ళు..బోలెడు కథలు చెబుతారు" మాట మారుస్తూ అంది సరోజ.

"నాకు వాళ్ళెవరూ లేరు. నేను ఇక్కడే ఉంటాను. అమ్మకు చెప్పండి" అంది.

"అమ్మ, నాన్న ఎప్పుడూ గొడవపడ్తారు!" అంది లేస్తూ.

"సరే వెళ్ళు! చెప్తాను. గొడవ చేయకుండా భోంచేసి పడుకో!" అని చెప్పి ఆయాని పిలిచి అప్పచెప్పింది.


హాస్టల్లో ఇంకా పరీక్షలు జరుగుతున్న పిల్లలున్నారు. వాళ్ళతో రెండు రోజులు ఉండనిచ్చి ఈ లోపులో హారిక తల్లితో మాట్లాడాలనుకుంది సరోజ. హారిక ఎందుకో మూడీగా ఉంటుంది. పసివయసు లక్షణంగా చక్కగా ఆడుతుంది. పాడుతుంది. ఎవరైనా పేరెంట్స్‌ని చూస్తే మూడీగా మారిపోతుంది. అసలు ఆ వయసు పిల్లలు హాస్టల్‌లో చాలా తక్కువ. పేరెంట్స్ కోరికమీద, పిల్లల్ని ఇంటిలో చూసుకోవడానికి లేనివాళ్ళు, క్యాంప్‌లకెళ్ళే వాళ్ళ పిల్లలు మాత్రం పది పదిహేనుమంది వరకూ ఉంటారు. అందరూ సెలవుల్లోనూ, సండేరోజు ఉత్సాహంగా వెళ్తారు. హారిక ఎప్పుడూ ఇష్టంగా వెళ్ళదు. పని ముగించుకుని బ్యాగ్ సర్దుకుని బయటపడింది. "రేపు కొంచెం లేట్‌గా వస్తాను!" అని ఆయాకి చెప్పి ఇంటికి వెళ్ళింది.

* * *

ఉదయాన్నే గబ గబా పని ముగించుకుని తను తెచ్చుకున్న ఎడ్రస్ వెతుక్కుంటూ వెళ్ళింది. ఆటోదిగిన వెంటనే హారిక తల్లి "రండి..కాసేపయ్యాక స్కూల్‌కి వద్దామనుకుంటున్నాను. ఈలోపు మీరు ఫోన్ చేశారు" అంది గేట్ తీస్తూ.

సరోజని సోఫాలో కూర్చోబెట్టి ఆవిడ లోపలికెళ్ళింది. అబ్జర్వ్ చేస్తూ కూర్చుంది సరోజ. చిన్న ఇల్లు





అయినా బావుంది. నీట్‌గా సర్ది ఉంది. షోకేస్‌లో చాలా బొమ్మలున్నాయి. మధ్యలో హారికది పెద్ద లామినేషన్ ఫోటో ఉంది. ఆ చివర్న హారిక అమ్మా, నాన్న కలిసి తీసుకున్న ఫోటో, అదీకూడా ఎప్పటిదో! రీసెంటివి ఏమీ లేవు.

"వస్తువులు తీయడానికి అసలు ఇంట్లో ఎవరూ ఉండరు కదా అందుకే నీట్‌గా ఉంది" అంది జ్యూస్ తెస్తూ హారిక తల్లి. అటూ ఇటూ చూస్తున్న సరోజతో.

"ఎవరూ లేకపోవడం ఏంటి? ఆఫీస్ టైమింగ్స్ అయ్యాక మీరిద్దరూ ఉంటారు కదా!" అంది సరోజ.

ఆమె మొహం కొద్దిగా నల్లబడింది. కనిపించనివ్వ కుండా "మా హనీ ఎలా ఉంది! పరీక్షలెలా రాసింది. నిన్న మా బ్రాంచ్ ఆఫీస్‌కి వెళ్ళవలసి వచ్చింది. వచ్చేస రికి పదిదాటుతుందని రాలేదు. మీకూ తెలుసుగా మా బ్యాంక్ వాళ్ళకి మార్చి, ఏప్రిల్‌లో వర్క్ ఎక్కువగా వుంటుంది" అంది.

"హనీ అదే మీ హారిక చాలా తెలివైనపిల్ల. కానీ దల్‌గా ఉంటుంది. మీరు సమ్మర్‌లో అయినా తనతో ఉండడానికి ట్రై చేయండి. లేదా కొన్ని రోజులు ఎక్కడి కైనా..."

"మేమూ ఎక్కడికీ వెళ్ళం. ఎవరూ లేరు. దూరంగా టూర్లు వెళ్ళడానికి ఒక్కదానివల్లా అవదు" అంది మధ్య లోనే.

"ఏమీ అనుకోకపోతే మీ సమస్య ఏమిటో చెప్పండి. హారిక ఇంటికి వెళ్ళను. హాస్టల్‌లోనే ఉండిపోతానం టుంది. ఎందుకు అందరికీ దూరంగా ఉన్నారు మీరు" యాంగ్జయిటీగా అడిగింది సరోజ.

వారిమధ్య మౌనం రాజ్యమేలింది కాసేపు.

"ఆయన సరిగా ఇంటికి రారు. నేను గొడవపడ తాను. అందుకే అది ఇష్టపడట్లేదు. ఇన్‌సెక్యూరిటీ ఫీల వుతుంది"

"మీరూ ఇంట్లో ఉండరని రావట్లేదేమో..రోజూ ఆఫీ స్‌ల దగ్గరే కలుసుకుని ఇంటికి వచ్చి సరదాగా ఉండచ్చు కదా! పాపకోసం మీరైనా సర్దుకోండి"

"నేనూ ఉండనని కాదు. ఆయనకి వేరే పెళ్ళైంది. సంసారం ఉంది. పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. అందుకే నన్ను ఎవాయిడ్ చేస్తున్నారు" కళ్ళు తుడుచు కుంటూ అంది.

"మీది లవ్‌మేరేజ్ అన్నారు కదా...పెళ్ళైనవాడిని ఎలా ప్రేమించారు. ఇంత చదువుకుని మంచి ఉద్యోగంలో ఉండి కూడా ఎలా మోసపో యారు" సీరియస్‌గానే అంది సరోజ.

"మేము చదువుకున్న రోజుల్లోనే కలిసాం. ఉద్యోగం వచ్చేదాకా పెళ్ళి వద్దన్నాడు. కానీ కలిసే ఉన్నాం. ఇద్దరం ఒకే ఇంట్లో ఉంటూ జాబ్స్‌కి ట్రై చేస్తుండేవాళ్ళం. మా అమ్మా, నాన్న ఇష్టం లేద న్నారు. నా భవిష్యత్తు నాదని మొండిగా వాదిం చాను. వాళ్ళకీ దూరమయ్యాను. నేను మూడు నెలలు ట్రైనింగ్ పిరియడ్‌కి వెళ్ళి వచ్చాను. ఇక్కడే వేసారు. తను వస్తూ వెళ్తూ ఉండేవాడు. నాకు ఉద్యోగం ఉంది కదా పెళ్ళిచేసుకుందాం అన్న ప్పుడు తన భార్యాపిల్లల గురించి అసలువిషయం చెప్పాడు. అప్పటికి హారిక ఇంకా పుట్టలేదు. వాళ్ళా చిన్న పిల్లలు. రెండోపెళ్ళి చేసుకుంటే నేరం, కానీ నీకూ నాకూ ఇష్టమే కాబట్టి సహజీ వనం చేద్దామన్నాడు. వేరే పెళ్ళి చేసుకున్నా నాకు భర్త అవుతాడు కానీ, పుట్టబోయే పాపకి తండ్రి ఎలా అవుతాడని జీవితంతో సంధి చేసుకుని హారిక కోసం బ్రతుకుతున్నాను. వారానికోసారి తను వచ్చినప్పుడు ఈ విషయాల మీదే గొడవ పడ్తాం. పైగా మీకు దూరంగా ఉండలేనని

అంటుంటాడు. ఏం చేయను చెప్పండి" ఆమె ఎక్కిళ్ళు పడ్తూ దుఃఖం ఆపుకోడానికి ప్రయత్నిస్తుంది.

"ఇప్పుడు గొడవపడి లాభం ఏమిటి? పాప కోసమైనా మీరు తనతో పదిరోజులు అమ్మ దగ్గరకు వెళ్ళండి. వాళ్ళు క్షమిస్తారు. సహకరిస్తారు. ఇలా అని చెప్తే హారిక కూడా సంతోషిస్తుంది" అనునయిస్తూ చెప్పాను.

ఆమె కళ్ళు మెరిశాయి. సరోజతోపాటు స్కూలుకి వెళ్ళడానికి రెడీ అవ్వడానికి లోపలికి వెళ్ళింది. స్కూలుకెళ్ళి హారికకు నచ్చజెప్పి తల్లితో పంపించింది. ఆమె ఫాదర్ నంబరు తీసుకుని మాట్లాడింది. "చూడండి మీ ఇద్దరిలో ఎవరిది పొరపాటు అయినా ఆ చిన్నారికోసం సర్దుకోక తప్పదు. 'నీకు మేమున్నాం' అన్న ఆలోచన తనలో కలిగేలా చేయండి. ఇలాగే వదిలేస్తే పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా తయారవుతుంది"

"తప్పకుండా మేడమ్!" అన్నాడతను. అందులో నిజాయితీ ఎంతో ఇకమీదటే తెలియాలి అనుకుంది మనసులో. ఆరోజంతా బిజీవర్కుతో ఆలస్యం అయింది సరోజకి. సాయంత్రం ఏడు దాటాక ఇంటికి బయలుదేరింది.

'సురేష్ వంట చేసుండుంటే బావుండును చాలా టైర్డ్‌గా ఉంది' అనుకుంటూ ఫోన్ చేసింది.

"నేనూ మార్కెట్‌లో వున్నాను. ఇంకా ఇంటికి వెళ్ళలేదు" అతని సమాధానం విని విసుక్కుంటూ ఇంటికెళ్ళి భోజనం ఏర్పాట్లు మొదలుపెట్టింది. పనిచేసుకుంటోందన్న మాటేగాని సరోజకు హారిక అమాయకమైన మొహం కళ్ళలో మెదుల్తూనే ఉంది. సురేష్ వచ్చాక ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి అనుకుంది.

★ ★ ★

"సురేష్..ఇలా ఎన్నాళ్ళు అప్పుడే నువ్వు నా దగ్గరకొచ్చి నాలుగు నెలల పైన అవుతుంది" అంది భోజనాలప్పుడు సరోజ.

"అయితే ఏమిటి.. మనం చదువుకున్నప్పటినుండీ ఒకరంటే ఒకరు ఇష్టపడ్డాం. మీ నాన్నగారు చనిపోవడంతో నీకు త్వరగా ఆయన ఉద్యోగం వచ్చింది. నేనేవో చిన్న చిన్నవి చేసుకుంటున్నాను. మంచి ఉద్యోగం తొందరలోనే వస్తుంది" చాలా ఈజీగా అన్నాడు.

"దానిగురించి కాదు. మనం పెళ్ళిచేసుకుందాం. ఏదో ఒకటి చేస్తున్నావుకదా. అమ్మ కూడా ఏవేవో వింటున్నాను...నిజమేనా, అని ఫోన్లు చేస్తుంది. పెళ్ళి అయిపోతే భయం ఉండదు" నిదానంగా అంది సరోజ.

"నామీద నీకు నమ్మకం లేదా? ఈ అడిగే వాళ్ళంతా మనకి కష్టంవస్తే ఆదుకుంటారా?! మంచి ఆదాయం వచ్చాకనే పెళ్ళి చేసుకుందాం"

"అందరి గురించి కాదు. ఒకవేళ పిల్లలు పుడితే!"

"ఎన్ని జాగ్రత్తలులేవు సరోజా..చదువుకొని అమ్మాయిలా మాట్లాడ్తావేం..."

"అవన్నీ స్త్రీకి ఆరోగ్యంకోసం పెట్టినవి. పెడదారి పట్టడానిక్కాదు" నిశ్చయంగా అంది సరోజ.

"ఇప్పటికిప్పుడు పెళ్ళి అంటే పెద్దవాళ్ళు ఒప్పుకోవద్దా..పెళ్ళి చేసుకుంటే బాధ్యతలు పెరుగుతాయి. చదువుసాగదు. నేను సివిల్స్‌కి ప్రిపేరవుదామనుకుంటున్నాను"

"పెళ్ళి అయ్యాక చదువుకున్నవాళ్ళు లేరా..నాతో సహజీవనం చేద్దామంటున్నావు. దానికిలేని అనుమతి పెళ్ళికి కావాల్సి వచ్చిందా! నిజంగా నేనంటే ఇష్టముంటే అమ్మని, మీ వాళ్ళని పిలిచి ముహూర్తం పెట్టించు. లేదా నేనే జరిగినదంతా వివరించి అలా ఇష్టపడినవాడినే పెళ్లిచేసుకుంటాను. ఇలా సంఘవ్యతిరేక పనులు నా వల్ల కాదు. ఇలాంటి వాటివల్ల చిన్నపిల్లలు, పెద్దవాళ్ళు ఎన్ని ఇబ్బందులు పడతారో ఇవాళే తెలిసింది. తెలియడం కాదు. కళ్ళతో చూసాను. నా పిల్లలకు అలాంటి భవిష్యత్తు వద్దు!" చాలా ఉద్విగ్నంగా గట్టిగా చెప్పింది సరోజ.


"పెళ్ళి చేసుకుని వదిలేసి వెళ్ళిపోతున్నారు కదా! అలాంటి వాళ్ళనేం చేసావు" వ్యంగ్యంగా అన్నాడు సురేష్.

"అప్పుడు అడగడానికి నిలదీయడానికి అన్నిరకాల హక్కులూ ఉంటాయి. ఫస్ట్ యూ గెటప్ అండ్ టేక్ ఏ సిన్సియర్ డెసిషన్" అంది సరోజ.

ఎప్పుడూ నవ్వుతూ ఉండే సరోజను అలా చూసి స్థాణువై నిలబడిపోయాడు సురేష్.

"నేను రేపుఉదయం నుండి అమ్మ దగ్గరే ఉంటాను. రోజూ అక్కడి నుండే స్కూలుకి వెళతాను. దూరమైనా ఫర్వాలేదు. నీకిష్టమైతే అక్కడికే వచ్చి అమ్మతో మాట్లాడు" అని చెప్పి తన సామాను సర్దడం మొదలుపెట్టింది.

○



## కత్రినా స్పెషాలిటీ

**కత్రినా విజయాల ఖాతాలో 'రాజ్‌నీతి' సినిమా కూడా చేరిందిప్పుడు. ఈ సినిమా నిర్మాణం మొదలైనప్పటినుంచే ఆమెకి కచ్చితంగా పేరు తెచ్చే చిత్రంగా చెప్పుకుంటూ వచ్చారు. అదిప్పుడు నిరూపణ అయింది. గ్లామరస్ డాల్‌గా కనిపించే కత్రినాలో ఇంత నటనా సామర్థ్యం వుందా అని అంతా ఆశ్చర్యపోతున్నారు. అయితే తనకంటే ఈ చిత్రంలో మనోజ్ బాజ్‌పాయ్ ఎంతో అద్భుతంగా నటించాడని ఇటీవల ఓ సభలో తెగ పొగిడిన కత్రినా ఏకంగా వేదికమీద అతనికి పాదాభివందనం కూడా చేసి తన స్పెషాలిటీ నిరూపించుకుంది.**